క్లుప్తంగా

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా మల్లికార్జునరావు



కొత్తగూడెంఅర్బన్: బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొత్తగూడెం పట్టణం గాజులరాజం బస్తీకి చెందిన గంధం మల్లికార్జున్‌రావును ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ మంగళవారం నియమించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌రావు మాట్లాడుతూ... త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంట్ బీఎస్పీ అభ్యర్థి గెలుపునకు సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసి పార్టీ గెలుపుకు కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కోఆర్డినేటర్ మాతాపురం బాలన్న, రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'ఏకలవ్య' విద్యార్థి ప్రతిభ



ప్రణీత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, కోచ్

టేకులపల్లి: ఏకలవ్య పాఠశాల విద్యార్థి సీహెచ్ యోగేంద్ర ప్రణీత్ సాఫ్ట్ బాల్‌లో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ భద్రయ్య, కోచ్ మహేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రణీత్ 8వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ భద్రాది కొత్తగూడెం టీం తరపున బాధ్యత వహించి నల్లగొండ జిల్లాలోని ఆలేరు మండలంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎన్నికైనట్లు చెప్పారు. ఈ నెల 28 నుంచి జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో తెలంగాణ తరపున పాల్గొంటాడని తెలిపారు.

సాంబశివుడికి నివాళి



పూలమాల వేస్తున్న రాజు

జూలూరుపాడు: తెలంగాణ ఉద్యమకారుడు కోనపురి సాంబశివుడి 13వ వర్ధంతిని జూలూరుపాడులో జేపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివుడి చిత్రపటానికి జేపీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఇడుపుల రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. సాంబశివుడు అజ్ఞాతంలో గడుపుతూ పేద ప్రజల హక్కుల కోసం పోరాడారని కొనియాడారు. అజ్ఞాతం వీడి జనజీవనంలోకి వచ్చిన తరువాత తెలంగాణ ఉద్యమంలో అమరుడైనట్లు చెప్పారు. కార్యక్రమంలో తంబర్ల నరసింహారావు, కాకటి వెంకటేష్, కోట చరణ్, చాపలమడుగు రమేష్ పాల్గొన్నారు.

కేసు నమోదు

పాల్వంచరూరల్: భూవివాదంలో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని జగన్నాథపురం గ్రామంలో బొల్లోరిగూడెంకు చెందిన షేక్ రుక్ముద్దీన్‌కు చెందిన నాలుగు ఎకరాల భూమిలో చుట్టూ ప్రహరీ నిర్మాణం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన సంపంగి వెంకన్న, గాదె బాల శివకుమార్ జేసీబీతో మంగళవారం కూల్చివేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గోడను కూల్చిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.శ్రీనివాస్ తెలిపారు.

ఇసుక రాశులు ఉన్నా.. ప్రయోజనం సున్నా..

- ఆదాయం కోల్పోతున్న పంచాయతీలు
- ఉపాధి లేక అల్లాడుతున్న కూలీలు
- 2016 - 2021 వరకు ఆదాయం ఫుల్
- రీచ్‌లు లేక ఇప్పుడు ఇక్కట్లు..



రంగాపురం వద్ద కిన్నెరసానిలో ఇసుక లోడు చేస్తున్న కూలీలు (ఫైల్)

పాల్వంచరూరల్: కిన్నెరసాని వాగులోని ఇసుక ఉన్నా గ్రామపంచాయతీలకు ప్రయోజనం సున్నాగా మారింది. ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండలంలోని కిన్నెరసాని వాగులోని ఇసుక పాండురంగాపురం, సూరారం, సోములగూడెం, రంగాపురం, నాగారం, దంతలబోరు, తోగ్గూడెం, నారాయణరావుపేట, సంగం గ్రామపంచాయతీలకు నాడు కల్పతరువుగా మారింది. కూలీలకు, ట్రాక్టర్ల యజమానులకు ఉపాధి లభించేంది. ఆయా గ్రామ పంచాయతీల పరిధి కిన్నెరసాని వాగులోని ఇసుకకు అధికారులు రీచ్‌లు ఏర్పాటు చేసి విక్రయించడం ద్వారా ఆదాయం వచ్చేది. ఒక ట్రాక్టర్ లోడు ఇసుకకు వినియోగదారుడు ముందుగా రూ.1000 డీడీ తీసేవారు. ఇందులో లోడింగ్, డంపింగ్ కూలీలకు రూ.400, రూ.400 పంచాయతీ ఖాతాలో జమ చేసేవారు. మైనింగ్‌శాఖకు రూ.120, తహసీల్దార్ కార్యాలయానికి రూ.30, వాల్టా చట్టం కింద డ్వామాకు రూ.50 చొప్పున జమ చేయడం ద్వారా ఆదాయం వచ్చేది. ఇసుక రీచ్‌లను నడిపిన సోములగూడెం పంచాయతీకి రూ.23.33లక్షలు, నాగారం పంచాయతీకి రూ.16.85 లక్షలు, జగన్నాథపురం పంచాయతీకి రూ.6.71 లక్షలు, రంగాపురం పంచాయతీకి రూ.6.71 లక్షల ఆదాయం లభించింది. ఇలా గ్రామపంచాయతీలకు సుమారు రూ.50 లక్షలపైన ఆదాయం వచ్చింది.

ఇసుక అనుమతులు రాక.. ఆదాయం లేక..

కానీ 2022 నుంచి ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు అధికారులు అనుమతులు ఇవ్వకపోవడం పంచాయతీలకు, కూలీలకు ఆదాయం, ఉపాధి కరువైంది. ఇసుక విక్రయాల ద్వారా పంచాయతీలకు పుష్కలంగా ఆదాయం లభించడమే కాకుండా కూలీలకు, ట్రాక్టర్ల నిర్వాహకులకు జీవనోపాధి కలిగేది. మూడేళ్లుగా ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు అనుమతులు లేక పంచాయతీలకు ఆదాయం లేక అభివృద్ధి కుంటుపడుతోంది. కూలీలకు పనులు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

అక్రమ మార్గంలో తరలిపోతున్న ఇసుక...

కిన్నెరసాని, ముర్రేడు వాగులోని ఇసుక రీచ్‌లను నిలిపివేయడంతో ఇసుకను కొంతమంది అక్రమ మార్గంలో రేయింబగవళ్లు లారీలు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు.

దీంతో పంచాయతీలకు దక్కవాల్సిన ఆదాయం అక్రమార్కుల జేబుల్లోకి వెళ్తోంది. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి పంచాయతీల పరిధిలోని వాగుల్లో ఇసుక రీచ్‌లను ఏర్పాటుకు అనుమతులు ఇస్తే పంచాయతీలకు ఆదాయం, కూలీలకు ఉపాధి దొరుకుతుంది. ఇసుక అక్రమ రావాణా జరగదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ఇసుక ఉన్నా ప్రయోజనం లేదు



కిన్నెరసాని వాగులో ఇసుక రీచ్‌ల ద్వారా పంచాయతీకి ఆదాయం వచ్చేది. అది స్థానిక అభివృద్ధి పనులకు ఉపయోగపడేది. గతంలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ ద్వారా పంచాయతీకి సుమారు రూ.20 లక్షల ఆదాయం వచ్చింది. మూడేళ్లుగా ఇసుక రీచ్‌లకు అనుమతులు రాక పంచాయతీ ఆదాయం కోల్పోతోంది.

– బి.రాజా, మాజీ సర్పంచ్ నాగారం

రీచ్‌లకు అనుమతులివ్వాలి



దంతలబోరు గ్రామపంచాయతీ పరిధిలో ఒకవైపు కిన్నెరసాని వాగు, మరోవైపు ముర్రేడు వాగులు ఉన్నాయి. వాటిలో ఇసుక పుష్కలంగా ఉంది. గతేడాది ఇసుక రీచ్ అనుమతుల కోసం అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. దీంతో ఇసుక అక్రమార్కుల పాలవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రీచ్‌లకు అనుమతులివ్వాలి.

– తెల్లం అలివేలు, మాజీ సర్పంచ్, దంతలబోరు

ప్రతిపాదనలు పంపించాలి



కిన్నెరసాని, ముర్రేడు వాగుల పరిధిలోని పంచాయతీలకు మైనింగ్‌శాఖ ద్వారా ఇసుక రీచ్‌ల అనుమతులు రావాల్సి ఉంటుంది. వాగుల్లో ఇసుక నిల్వ, సామర్థ్యాలను అధికారులు సర్వే చేసి ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇస్తారు. పంచాయతీల ప్రత్యేకాధికారుల తీర్మానం చేసి ప్రతిపాదనలు పంపిస్తే తాను కలెక్టర్‌కు పంపిస్తాను.

– కె.విజయభాస్కరరెడ్డి, ఎంపీడీఓ, పాల్వంచ

పోలింగ్ కేంద్రాల తనిఖీ



కేంద్రంలో పరిశీలిస్తున్న ఏఆర్‌ఓ సత్యప్రసాద్

జూలూరుపాడు: మండలంలోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఖమ్మం పార్లమెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి (ఏఆర్‌ఓ) సత్యప్రసాద్ ఆకస్మికంగా సందర్శించారు. లయన్‌తండా, కరివారిగూడెం, కొమ్ముగూడెం, మాచినేనిపేటతండా, మాచినేనిపేట, పడమటనర్సాపురం పోలింగ్ కేంద్రాలను ఏఆర్‌ఓ సత్యప్రసాద్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లోని గదుల్లో వెలుతురు, విద్యుత్, తాగునీటి సౌకర్యంతోపాటు, వాషింగ్ రూమ్, టాయిలెట్స్ ఆయన పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఎన్నికలకు సమయం ఉండటంతో మోడల్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, ఎంపీఓ తులసీరామ్, జీపీ సెక్రటరీలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న సీడీపీఓ సలోమి

కొత్తగూడెంటౌన్: ప్రస్తుత సమాజంలో ప్రతీఒక్కరు పోక్సో చట్టం, సైబర్ మోసాల పట్ల అవగాహన ఉండాలని కొత్తగూడెం సీడీపీఓ సలోమి, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ దొడ్డపాటి దాసు అన్నారు. మంగళవారం కొత్తగూడెం హెడ్డాఫీస్ సమీపంలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగస్తుల భవనంలో అంగన్‌వాడీలకు పోక్సో చట్టం, సైబర్ నేరాలపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీడీపీఓ సలోమి, డాక్టర్ దొడ్డపాటి దాసు హాజరై మాట్లాడారు. మానవ హక్కులు, సమాచారానికి చట్టం వంటి విషయాలను వివరించారు. అలాగే సమాజంలో సైబర్ నేరాల తీవ్రత పెరుగుతోందని, అలాంటి మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ చట్టాలపై ప్రతీ అంగన్‌వాడీ స్థానికంగా ఉన్న ప్రజలందరికీ తెలిసేలా చేయాలని అందుకు అంగన్‌వాడీలు అవగాహన కలిగి ఉండటం చాలా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సలోమి, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు మంచు కిరణ్, టీఎస్ స్టేట్ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ అధ్యక్షురాలు యనమల రుక్మిణి, వైస్ ప్రెసిడెంట్ తేళ్లూని చిన్న యేసు, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మంగా సీత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ చంద్రభాను, పోలీసులు

ఇల్లెందురూరల్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ చంద్రభాను ఆదేశించారు. మండలంలోని ఒడ్డుగూడెం, రొంపేడు చెక్‌పోస్టులను మంగళవారం డీఎస్పీ తనిఖీ చేశారు. పలు వాహనాలను స్వయంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనుమానం ఉన్న వాటితోపాటు ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని సూచించారు. ఈ సమయంలో ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా తనిఖీ ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలన్నారు. ఏమాత్రం అజాగ్రత్తతో ఉన్నా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమయపాలన పాటించండి..



తడికలపూడి పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరును తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

టేకులపల్లి: ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు ప్రతీరోజు సమయపాలన పాటించాలని టేకులపల్లి ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం తడికలపూడి, తావుర్యాతండా పంచాయతీల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలు, తెలంగాణకు హరితహారం నర్సరీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని, అంగన్‌వాడీల్లో పాలప్యాకెట్లు, గుడ్లు, బాలామృతం ప్యాకెట్లను తనిఖీ చేశారు. పాఠశాలల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలని సూచించారు. నర్సరీలలో మొక్కలను షిఫ్టింగ్, గ్రేడింగ్ చేయించాలని, మొక్కలు రాని బ్యాగులో వేరే గింజలు నాటాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి లక్ష్మిగణేష్ గాంధీ, అదనపు కార్యక్రమ అధికారి, కాలంగి శ్రీనివాస్, కార్యదర్శులు అజయ్, గోపాలకృష్ణ, క్షేత్ర సహాయకులు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇల్లెందు: పట్టణంలోని పలు ఆలయాల్లో కాంగ్రెస్ నేతలు ప్రత్యేక పూజలు చేశారు. ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాదరెడ్డికి టికెట్ కేటాయించాలని కోరుతూ శివాలయంలో, ఆంజనేయ స్వామి ఆలయం, వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసినట్లు పొంగులేటి అభిమానులు, కాంగ్రెస్ సభ్యులు ఆవునూరి గణేష్, సుమిత్ కోరీ, రాంబాబు, రాజీవ్, అయ్యప్ప, రాజశేఖర్, ప్రదీప్‌లు ఉన్నారు.

ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్‌కు సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్ కాస్టు ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా బదిలీపై వచ్చిన వాసంశెట్టి శ్రీనివాస్‌ను బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ మేరకు మంగళవారం కోయగూడెం ఓపెన్ కాస్ట్ ఇల్లెందు డివిజన్ కార్యదర్శి ఎస్‌వీఎస్‌ఎస్ రాజు అధ్యక్షతన నూతన ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆఫీసర్స్, మేనేజర్ సుమన్, రాజు, జనరల్ షిఫ్ట్ ఇన్‌చార్జ్‌లు రవికుమార్, శ్రీకాంత, కృష్ణ, పిట్ కార్యదర్శి లీలకృష్ణ, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి, సర్వర్, రామస్వామి, నజీర్ అహ్మద్, అశోక్, కిషోర్, శ్రీనివాస్, నవీన్, భూక్యా నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

దారి తప్పుతున్న రేషన్ బియ్యం



నవభారత్: రేషన్ బియ్యం అక్రమంగా రీసైక్లింగ్ చేసి ప్రతీనెల రూ.లక్షలు వెనకేసుకోవడం కొత్తగూడెంకు చెందిన ఓ వ్యక్తికి అలవాటుగా మారింది. జిల్లాకు ఏ పెద్ద అధికారి వచ్చినా వెళ్లి కలవడం.. తనతో పాటు పేరున్న వ్యాపారులను సైతం తీసుకెళ్తుండడంతో అందరికీ పరిచయస్తుడుగా మారి బియ్య దందాకు మార్గం సుగమమం చేసుకోవడం ఇతని ప్రత్యేకత. కొత్తగూడెంలోని పెద్దబజార్‌కు చెందిన వాసు. ఇతను పేరుకు మాత్రమే బియ్యం అమ్మకాలు చేస్తారు. కానీ మిల్లర్‌గా తాను కొన్న బియ్యాన్ని సైతం రీసైక్లింగ్ చేస్తూ కొన్నదానికి నాలుగింతలు ఎక్కువ ధరకు అమ్ముతూ అటు ప్రజలను, ఇటు ప్రభుత్వాన్ని తప్పు దోవ పట్టిస్తూ రూ.లక్షల వ్యా పారం సాగిస్తున్నా ఏ అధికారీ ఇటు వైపు చూడకపోవడం గమనార్హం. ఆ వ్యాపారి మిల్లుకు దాదాపు కొత్తగూడెం, పాల్వంచ, చంద్రుగొండ, ఇల్లెందులతో పాటు పలు ప్రాంతాల్లో అక్రమంగా సమీకరించిన రేషన్ బియ్యం దళారులు చేరవేస్తుంటారు. పోలీసులు, రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులను సమన్వయ పరుచుకుని దందా చేస్తున్నాడనే విమర్శలు ఉన్నాయి. జిల్లా నలుమూలల నుంచి ప్రతీ ఏరియాలో దళారులను ఏర్పాటు చేసుకుని రేషన్ బియ్యం సేకరిస్తుంటాడు. ఇలా రేషన్ లబ్ధిదారుల నుంచి కేజీ రూ.11 - 13లకు బియ్యం కొని ఇతని మిల్లుకు తరలిస్తుంటారు. రీసైక్లింగ్ చేసి కేజీ రూ.40 - 60 వరకు అమ్ముతుంటాడు. ఇంత జరుగుతున్నా ఆ జిల్లా పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ అధికారులకు తెలిసినా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులకు చెప్పుకుంటున్నారు. సరుకు దొరికితే తూతూ మంత్రంగా కేసులు పెడతారని ఇది బహిరంగ రహస్యమేనంటున్నారు. ఆ వ్యాపారి సమాజంలో పేరున్నవాడు. పైగా అందరి అధికారులతో సత్సంబంధాలు ఉండటంతో సరుకు పట్టుకోగానే అతనికి సమాచారం చేరవేస్తారు. దీంతో ఆ వ్యాపారి రంగంలోకి దిగి అధికారులతో మాట్లాడి తన పేరు బయటకు రాకుండా తక్కువ ఫైన్‌తో బయట పడతాడనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ వ్యాపారి రేషన్ దందాకు చెక్ పెట్టి రేషన్ బియాన్ని పేదలకు అందేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఇల్లెందు ఆర్టీసీ బస్టాండ్ కిటకిట

- బస్సులు లేక ప్రయాణికులు విలవిల
- ఉపయోగపడని బస్సు డిపో
- రద్దీ ఉన్నా.. అడ్రస్ లేని బస్సులు



ఇల్లెందు బస్టాండ్‌లో ప్రయాణీల రద్దీ

ఇల్లెందు: ఒకవైపు విద్యార్థులకు పరీక్షలు నడుస్తున్న రోజులు.. మరోవైపు పండుగలు.. వెరసీ ఇల్లెందు బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. ప్రయాణికులు గంటల కొద్ది వేచి చూడాల్సి వస్తోంది. బస్సులు రాకపోవడంతో జనం విలవిలలాడుతున్నారు. ఇల్లెందు కేంద్రంగా బస్సు డిపో ఏర్పాటు చేసినా ప్రయాణికుల అవసరాలు తీర్చే పరిస్థితిలో లేదు. ఇక ఇల్లెందు బస్టాండ్‌కు కేటాయించిన బస్సులన్నీ పాతవే కావటంతో ప్రయాణికులను వేగంగా గమ్యస్థానాలకు చేర్చటం లేదు. డ్రైవర్లు, కండక్టర్లు పాత బస్సులలో ప్రయాణంగా భారంగా ఉందంటున్నారు. దీనికి తోడు మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్ ప్రయాణం అమలు చేస్తుండడంతో పెద్ద ఎత్తున మహిళలు ఈ సదుపాయాన్ని ఉపయోగించుకుంటున్నారు. తరలివచ్చిన మహిళలతో బస్టాండ్ కిటకిటలాడుతోంది. గంటల కొద్దీ పడిగాపులు కాస్తే ఒకటి రెండు బస్సులు వస్తే.. గుంపులుగా పరుగున బస్సు ఎక్కాల్సిన పరిస్థితి. ఇక సీట్లు దొరకడం అన్నమాటే లేదు. మంగళవారం ఇల్లెందు బస్టాండ్‌లో విపరీతంగా ప్రయాణికుల రద్దీ నెలకొంది. ఇదే తరహా నిత్యం బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడుతోందని, అందుకు తగినన్ని బస్సులు ఏర్పాటు చేయటం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గంటల కొద్ది వేచి చూసినా బస్సులు లేక ప్రయాణికులు ఆటోలు, టాటా మ్యాజిక్‌ల ద్వారా ప్రయాణించారు. ఇదిలా ఉంటే బస్టాండ్‌లోనే బస్సులు నిండిపోతున్నాయి. పలు స్టాప్‌లలో బస్సులు ఆగకుండానే వెళ్లిపోతున్నాయి. ఆయా స్టాప్‌ల వద్ద ప్రయాణికులు గంటల కొద్ది ఎదురు చూసి బస్టాండ్‌కు చేరుకోవాల్సి వస్తోంది. హోలీ పండుగ, అంతకు ముందు రోజు ఆదివారం రెండు రోజుల సెలవులు రావటం వల్ల ప్రయాణికులు భారీగా ప్రయాణాలు కొనసాగించారు. దీంతో బస్టాండ్ కిటకిటలాడింది. ఏ బస్సు వచ్చినా సీట్ల కోసం ప్రయాణికులు పరుగులు తీశారు.

పట్టించుకోని పాలకులు..

ఇల్లెందు బస్టాండ్‌లో సదుపాయలు, డిపోలో ఎదురవుతున్న సమస్యలు, ప్రయాణికులకు ఎదురవుతున్న కష్టాలను పాలకులు, అధికారులు ఆరా తీసే పరిస్థితిలో లేరని పలువురు ప్రయాణీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనాడూ అధికార, ప్రతిపక్ష పాలక పార్టీల నేతలు నిత్యం వందల మంది ప్రయాణించే బస్ ప్రాంగణం వైపు రాలేదని, ఇక డిపోలోనూ అనేక సమస్యలు ఉన్నాయని, కనీసం ఆర్టీసీ మంత్రితో చర్చించి కొత్త బస్సులు రప్పించే ప్రయత్నం చేయడం లేదంటున్నారు.


కన్నెత్తి చూడని అధికారులు..

బస్సు డిపో, బస్టాండ్‌లో సమస్యలు తెలుసునేందుకు, ప్రయాణికులు ఏమంటున్నారో అడిగేందుకు అటు ఆర్టీసీ అధికారులు, ఇటు జిల్లా అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడలేదంటున్నారు. జిల్లా పరిపాలనా అధికారులు కలెక్టర్, ఏటీడీఏ పీఓ, ఆర్డీఓ స్థాయి అధికారులు ప్రజా సమస్యలు పరిశీలించేందుకు, గ్రామస్థాయి సమస్యల తెలుసుకోకపోతే ఎలా పరిష్కారం అవుతాని ప్రయాణికులు అంటున్నారు. ప్రభుత్వం ఆయా గ్రామాలలో సమస్యలు వాకబు చేయటంతో పాటు పరిష్కారం కోసం నిధులు కేటాయించాలని కోరుతున్నారు.



బస్సు రాగానే పరుగులు పెడుతున్న జనం

సరిపడా బస్సులు నడిపించాలి..



ఇల్లెందు బస్టాండ్ నుంచి ఖమ్మం, మహబూబాబాద్, కొత్తగూడెం, గుండాలలకు నిత్యం బస్సులు నడుస్తుంటాయి. అయితే ప్రయాణికులకు అనుగుణంగా బస్‌లు ఏర్పాటు చేయాలి. కొత్తగూడెం, ఖమ్మం ప్రయాణికులు వేచి చూడాల్సి వస్తోంది. రద్దీ ఎక్కువగా ఉన్న రహదారులను సర్వే చేసి బస్‌లు నడిపించాలి. గుండాల రూట్‌లో ప్రతీ గంటకు ఒక బస్సు, గుండాల, ఆళ్లపల్లి, మర్కోడులకు ఒకటి, రెండు సర్వీసులు నడిపించాలి..

– యాకూబ్‌షావలీ, మాస్‌లైన్ కార్యదర్శి, ఇల్లెందు

పాత బస్సులు తొలగించాలి..



ఇల్లెందులో ఆర్భాటంగా ఆర్టీసీ బస్సు డిపో ఏర్పాటు చేశారు. కానీ సరిపడా బస్సులు కేటాయించ లేదు. ఉన్న అన్ని బస్సులు పాతవే. ప్రభుత్వం పరిశీలించి ఉమ్మడి జిల్లాలోని అన్ని డిపోల నుంచి కొన్ని కొత్త బస్సులను ఇల్లెందుకు కేటాయించాలి. పాత బస్సులలో ప్రయాణం నరకంగా మారుతోంది. ఎండాకాలం కాబట్టి ప్రయాణికులు బస్టాండ్‌లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి.

– చాందావత్ రమేష్‌బాబు, ఇల్లెందు

నాయకుల అండదండలతో ఇష్టారాజ్యం..



బస్టాండ్ సెంటర్‌లో ప్రధాన రోడ్డు పక్కన సెల్లార్ నిర్మాణ పనులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం జిల్లా కేంద్రం మున్సిపాలిటీలో బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టాలి అంటే మున్సిపల్ కార్యాలయం నుంచి అనుమతులు తప్పనిసరి. ఆ అనుమతులు వచ్చిన తరువాతే పనులు మొదలు పెట్టాల్సి ఉంటుంది. కానీ పట్టణం నడిబొడ్డున ఆర్టీసీ బస్టాండ్ రోడ్డుకు వెళ్లే మార్గంలో ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలో ఆ యజమాని బహుళ అంతస్తు నిర్మించేందుకు మొదట సెల్లార్‌కు మట్టి తవ్వకాలు మొదలుపెట్టారు. మట్టిని తవ్వి పెద్దపెద్ద గుంతలు తీశారు. ప్రధాన రోడ్డు కావడం రాత్రివేళలో వచ్చిపోయేవారు ఏమరుపాటుగా ఆ గుంతల్లో పడి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోకుండా, కనీసం మున్సిపాలిటీ నుంచి అనుమతులు కూడా పొందకూడా ఆ యజమాని ఇష్టారాజ్యంగా, రాజకీయ నాయకుల అండదండలతో మున్సిపల్ నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు తుంగలో తొక్కి, స్వప్రయోజనమే ధ్యేయంగా నిర్మాణ పనులు చేయిస్తున్నాడు. రాత్రి సమయాల్లో కూడా పనులు చేయిస్తుండడంతో సోమవారం రాత్రి మున్సిపల్ టీపీఎస్ తన సిబ్బందితో అక్కడికి వెళ్లి అనుమతులు లేకుండా సెల్లార్ నిర్మాణ పనులు చేయొద్దని చెప్పారు. పనులు జరిగితే మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినా మున్సిపల్ అధికారులు ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఆ స్థల యజమాని జేసీబీ, ట్రాక్టర్లతో మట్టిని తవ్విస్తూనే ఉన్నాడు. ఆ స్థలంలో గతంలో బహుళ అంతస్తు ఉండేది. అది శిథిలావస్థకు చేరడంతో మున్సిపల్ నుంచి అనుమతులు లేకుండానే దానిని తొలగించారు. ప్రధాన రోడ్డుకు మార్గంలో బిల్డింగు ఉండడం వలన తొలగించే సమయంలో కనీస నిబంధనలు కూడా పాటించలేదు. బస్టాండ్, ప్రధాన రోడ్డుపై వెళ్లే వాహనదారులు, పాదాచారులు, చుట్టుపక్కల షాపులవారు దుమ్ము, ధూళితో తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. అయినా యథేచ్ఛగా పనులు చేశారు. ఈ విషయంపై టీపీఎస్ ప్రభాకర్‌ను వివరణ కోరగా... సోమవారం రాత్రి పనులు జరిగే ప్రాంతానికి వెళ్లి పనులు నిలిపివేయాలని హెచ్చరించాం. అనుమతులు లేకండా పనులు చేస్తే చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని చెప్పాం. అయినా పనులు చేస్తుంటే చర్యలు తీసుకుంటామని చెప్పారు.